సాక్షి విశాఖపట్నం

బుధవారం । 1 । నవంబర్ । 2023



ఐక్యతా వారధి సర్దార్ పటేల్

సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో నవ భారత నిర్మాణం జరిగిందని జిల్లా అధికారులు పేర్కొన్నారు. 8లో



పలు రైళ్లు రద్దు, రీ షెడ్యూల్

విజయనగరం జిల్లా కంటకాపల్లి-అలమండ మధ్య జరిగిన ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దు చేశారు. 8లో



అండగా ఉంటాం

రైలు ప్రమాదంలో మృతి చెందిన రైల్వేగార్డు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మేయర్ పరామర్శించారు. 8లో

కొత్త ఫ్లైట్లు వస్తున్నాయ్



స్పైస్ జెట్

నడపనున్న విమానాల సంఖ్య : 5
ఎప్పటి నుంచి : జనవరి
ఎక్కడెక్కడకు...: హైదరాబాద్, కోల్‌కతా,జార్సిగుడలకు డైలీ చెన్నై, బెంగళూరుకు వారంలో మూడు,నాలుగు రోజులు

ఇండిగో

నడపనున్న విమానాలు : 2
ఎప్పటి నుంచి : నవంబరు 15 నుంచి కోల్‌కతాకు, 16 నుంచి బెంగళూరుకు..
ఎక్కడెక్కడకు...: కోల్‌కతా, బెంగళూరులకు డైలీ సర్వీస్



- వీటిలో స్పైస్ జెట్ 5, ఇండిగో 2 విమాన సర్వీసులు
- చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాలకు నడిపే వీలు
- త్వరలో శ్రీలంక సర్వీసు కూడా పునరుద్ధరణ
- విశాఖ విమానాశ్రయానికి పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి
- కోవిడ్ పూర్వ స్థితికి చేరుకుంటున్న రద్దీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు కొత్త విమాన సర్వీసులు రానున్నాయి. ఒకవైపు ప్రయాణికుల రద్దీ అధికమవుతుండడం, మరోవైపు పరిపాలనా రాజధాని కానుండడంతో విమానయాన సంస్థలు విశాఖ వైపు ఆసక్తి చూపుతున్నాయి. విశాఖపట్నానికి స్పైస్ జెట్ ఐదు, ఇండిగో సంస్థ రెండు విమాన సర్వీసులు నడపడానికి అనుమతులు తెచ్చుకున్నాయి. ఈ విమానాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతాలతో పాటు ఒడిశాలోని జార్సిగుడ ఎయిర్‌పోర్టుకు కూడా నడపడానికి సంబంధిత సంస్థలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. వీటిలో స్పైస్ జెట్ హైదరాబాద్, కోల్‌కతా, జార్సిగుడలకు డైలీ, చెన్నై, బెంగళూరులకు వారంలో మూడు, నాలుగు రోజులు చొప్పున నడపనుంది. అలాగే ఇండిగో సంస్థ కోల్‌కతా, బెంగళూరులకు రోజూ తమ విమానాలను నడపాలని నిర్ణయించింది. స్పైస్ జెట్ సంస్థ జనవరి నుంచి విశాఖకు తమ సర్వీసులను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇండిగో సంస్థ నవంబర్ 15 నుంచి కోల్‌కతాకు, 16 నుంచి బెంగళూరుకు నడపనుంది. కోల్‌కతా సర్వీసు సాయంత్రం 6.55 గంటలకు, బెంగళూరు సర్వీసు ఉదయం 10.30 గంటలకు బయలుదేరనుంది. కాగా ఈ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికుల రద్దీ కోవిడ్‌కు ముందు పరిస్థితికి చేరుకుంటోంది. కోవిడ్‌కు ముందు ఏటా 2.85 మిలియన్ల ప్రయాణికులు రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్యకు దానికి చేరువలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరుకు అది 3 మిలియన్లకు చేరుతుందని ఎయిర్‌పోర్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలిసారిగా జార్సిగుడకు..

ఇప్పటివరకు విశాఖపట్నం నుంచి ఒడిశాలోని జార్సిగుడకు విమాన సర్వీసులు లేవు. తొలిసారిగా స్పైస్ జెట్ సంస్థ పారిశ్రామిక ప్రాంతమైన జార్సిగుడకు విమాన సర్వీసును నడపాలన్న నిర్ణయం తీసుకుంది. విశాఖ-జార్సిగుడల మధ్య ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉందన్న అంచనాతో స్పైస్ జెట్ తమ విమానాన్ని నడపడానికి ముందుకొచ్చింది.

శ్రీలంక సర్వీసు పునరుద్ధరణ

మరోవైపు శ్రీలంక-విశాఖల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసు మళ్లీ పునరుద్ధరణ కానుంది. 2017లో కొలంబో-విశాఖ మధ్య శ్రీలంకన్ ఎయిర్ లైన్స్ తమ విమాన సర్వీసును ప్రారంభించింది. అయితే కోవిడ్ సమయంలో ఈ సర్వీసు రద్దు అయింది.

త్వరలోనే ఆ విమాన సర్వీసును పునరుద్ధరించనున్నట్టు ఎయిర్‌పోర్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు ఒకే ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. గతంలో బ్యాంకాక్, దుబాయ్‌లకు కూడా ఇక్కడ నుంచి నడిచేవి. త్వరలో కొలంబో సర్వీసును కూడా పునరుద్ధరిస్తే ఈ ఎయిర్‌పోర్టు నుంచి రెండు అంతర్జాతీయ సర్వీసులు నడిచినట్టవుతుంది.

విమానయాన సంస్థలకు లేఖలు



విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన అన్ని సదుపాయాలున్నాయి. 24 గంటలూ విమానాల రాకపోకలకు అనువైన ఏర్పాట్లున్నాయి. 16 పార్కింగ్ స్టాండ్లు, 3.33 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెర్మినల్ బిల్డింగ్, 30 చెక్ ఇన్ కౌంటర్లు, మూడు పాసింజర్ బోర్డింగ బ్రిడ్జిలు, 36 ఇమిగ్రేషన్, కస్టమ్స్ కౌంటర్లు ఉన్నాయి. ఏటా ఈ విమానాశ్రయం 3.5 నుంచి 4 మిలియన్ల పాసింజర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. పైగా సుందరమైన ఈ నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. స్టీల్‌ప్లాంట్, పోర్టులు, హెచ్‌పీసీఎల్, ఎస్‌సీజెడ్, తూర్పు నావికాదళం ప్రధాన కేంద్రం, ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. వాణిజ్యపరంగానూ ఎంతో అభివృద్ధి చెందుతోంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని విశాఖకు విమాన సర్వీసులను విస్తృతం చేయాలంటూ దేశీయ, అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్‌లకు ఇటీవలే లేఖలు రాశా. ఆయా సంస్థల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నా.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు

రేపు విశాఖకు సీఎం జగన్



మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 7.35 గంటలకు సీఎం నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు. 8.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో 9.15 గంటలకు మధురవాడ ఐటీ హిల్‌కు చేరుకుంటారు. 9.20 గంటలకు రోడ్డు మార్గం ద్వారా రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు బయలుదేరుతారు. 9.30 గంటల నుంచి 11 గంటల వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీలో (ఐసీఐడీ) పాల్గొంటారు. 11.05 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్ నుంచి బయలు దేరి మధురవాడ హెలిపాడ్‌కు చేరుకుంటారు. 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. 11.45 గంటలకు విమానంలో తిరుగు పయనమవుతారు.

నేవీలో మహిళలకు ఉద్యోగావకాశాలు



విద్యార్థినులతో నౌకాదళ అధికారి

భీమునిపట్నం: భారత నౌకాదళంలో మహిళలకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని నౌకాదళ అధికారి ఎస్.కుమార్ అన్నారు. మంగళవారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. సరైన ప్రణాళికతో చదువుకుంటే నేవీలో ఉద్యోగాఅవకాశాలు పొందవచ్చన్నారు. సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో గొప్ప అవకాశాలను కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



పశ్చిమబంగా మంత్రి మన్నాకు అప్పన్నకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పశ్చిమబంగా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి బేచారం మన్నా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. అలాగే కేంద్రప్రభుత్వ ఐఏఎస్ అధికారి గోయల్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. పీఆర్‌వో నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆచార్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆచార్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. వర్సిటీలో, ఆర్ట్స్-కామర్స్, సైన్స్-టెక్నాలజీ, లా, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో 523 ఉద్యోగాల భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం జారీ చేశారు. 85 ప్రొఫెసర్, 139 అసోసియేట్ ప్రొఫెసర్, 299 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. వీటిలో 509 ఉద్యోగాలు రెగ్యులర్‌వి కాగా, 14 ఉద్యోగాలు బ్యాక్‌లాగ్. పూర్తివివరాలు కోసం ఏయూ వెబ్‌సైట్‌ని సంప్రదించాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సూచించారు.

ఇద్దరు క్షతగాత్రుల డిశ్చార్జ్

మహారాణిపేట: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడ్డ వారిలో ఇద్దర్నీ మంగళవారం డిశ్చార్జ్ చేశారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి, నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మను మంగళవారం డిశ్చార్జ్ చేశామన్నారు. విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి, గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముర్రు లక్ష్మికి శస్త్ర చికిత్సలు నిర్వహించామని, ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు.

10,473 మందికి వైద్య సేవలు

నేడు 23 ప్రాంతాల్లో
జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అర్బన్ ప్రాంతంలో మంగళవారం 21 ప్రాంతాల్లో నిర్వహించారు. మొత్తం 10,473 మంది రోగులకు వైద్య సేవలు అందించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ శిబిరాల్లో స్త్రీల వైద్యురాలు, పిల్లల వైద్యుడు, జనరల్ ఫిజీషియన్, డెంటల్ వైద్యులు హాజరయ్యారు. రోగులకు మందులు కూడా ఉచితంగా అందజేశారు. నగరంలో జరుగుతున్న పలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సందర్శించినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో..

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు బుధవారం 23 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జగదీశ్వరరావు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ఏపీ రాష్ట్ర అవతరణ వేడుకలు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. తొలుత జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఆహ్వానించారు.

ఇద్దరు తహసీల్దార్లకు పదోన్నతి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతులు లభించింది. తాత్కాలిక, హడ్‌హక్ పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతులు కల్పిస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం తహసీల్దార్ యల్లంపల్లి శ్రీనివాసరావుకు , ఏఎస్ఆర్ జిల్లా వీఆర్‌పురం తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ కె.ఎస్.విశ్వనాథన్,డీఆర్‌వో మోహన్ కుమార్

మహారాణిపేట: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఓటర్ల చేర్పులకు సంబంధించి ఫారం 6, 7, 8 ప్రకారం కచ్చితమైన జాబితాను తయారుచేయాలన్నారు. ఇంటింటా వెరిఫికేషన్ ద్వారా తీసుకున్న అప్లికేషన్లలో సవరణలు డిసెంబరు 7 నాటికి పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, ఎస్డీసీలు,ఏఈఆర్‌వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున పరిశీలించారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించనున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ (ఐసీఐడీ) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మలతో కలిసి కలెక్టర్ మల్లికార్జున రాడిసన్ బ్లూ హోటల్‌ను సందర్శించారు. సమావేశ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే సమావేశాలు దృష్ట్యా నిర్వహణ పరమైన లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ దేశాలమంత్రులు హాజరుకానున్నందున మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



రాడిసన్ బ్లూ హోటల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ తదితరులు

కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఉమేష్ కుమార్, భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్ బాస్ సీరియస్

- నేర సమీక్షలో సమాచారం లేకపోవడంపై ఆగ్రహం
- స్వయంగా సమీక్షిస్తానని హెచ్చరిక



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: స్టేషన్ హౌస్ ఆఫీసర్ల తీరుపై సిటీ పోలీస్ బాస్ సీరియస్ అయ్యారు. ఎటువంటి సమాచారం లేకుండా నేర సమీక్షకు రావడంపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు లేకుండా వచ్చిన కొంత మంది ఇన్‌స్పెక్టర్ల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్వయంగా స్టేషన్లకు వచ్చి అక్కడే సమీక్షిస్తానని స్పష్టం చేశారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా నేరాల వివరాలపై ఆరా తీశారు. ఆయా స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసులు, రౌడీషీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలు, యాక్టివ్‌గా ఉన్న వారి వివరాలను ప్రశ్నించారు. వీటిపై కొంత మంది ఇన్‌స్పెక్టర్లు సరైన సమాచారం అందించకపోవడంతో సీపీ వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎటువంటి వివరాలు లేకుండా సమీక్షకు ఎలా వచ్చారంటూ గట్టిగానే మందలించడంతో పాటు నేరుగా స్టేషన్లకే వచ్చి కేసులను సమీక్షిస్తానని తేల్చి చెప్పినట్లు తెలిసింది.

- త్వరలో జరగనున్న నేవీ మారథాన్ రన్ నేపథ్యంలో నేవీ అధికారులు, నగర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి రూట్ మ్యాప్ పరిశీలించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ మళ్లింపు, రన్ సజావుగా విజయవంతమయ్యేందుకు ఏర్పాట్లపై చర్చించారు.
- అనంతరం లోక్ అదాలత్ గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.
- ప్రాధాన్యత గల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కోర్టులో విచారణకు వచ్చి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- నగరంలో రోడ్డు ప్రమాదాల్లో మరణాలు, గాయాలకు గురికావడం పూర్తిగా తగ్గేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రద్దీ సమయాల్లో సిబ్బందితో పలు ప్రాంతాలలో పరిశీలనలు చేసి, ప్రత్యేకంగా సిబ్బందిని ఆయా ప్రాంతాల్లో నియమించి ప్రమాదాలు, మరణాల శాతం పూర్తిగా తగ్గేలా చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు నగరమంతా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- ఎన్‌డీపీఎస్ రవాణాకు పూర్తి అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాటి లింక్‌లను చివరివరకూ విచారణ చేయాలన్నారు.
- నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీసి తగు సూచనలు చేశారు.
- మహిళా భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై వేధింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలని చెప్పారు. పోక్సో కేసులపైన ఆరా తీశారు.
- నగరంలో క్రైమ్ రేట్ తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని తెలిపారు. రాత్రి విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ ట్యాబ్‌లో తమ లొకేషన్ తెలిసే విధంగా ఉండాలని చెప్పారు.
- వీఎంఎస్ (విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్)ను పూర్తిగా లా-ఆర్డర్, క్రైమ్ సిబ్బంది అందరూ వినియోగిస్తూ నిందితులను మరింత వేగంగా గుర్తించాలన్నారు.
- ఎస్‌ఈబీ బృందాలుగా నగరంలో విద్యాసంస్థలు వద్ద నిఘా ఉండాలని, ప్రముఖ ప్రాంతాల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.
- పెండింగ్‌లో ఉన్న కేసులు, అందుకు గల కారణాలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు పలు సూచనలు చేశారు.
- వచ్చే నెలలో జరిగే సమీక్షా సమావేశంలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో క్రైంరేట్ తగ్గుముఖం పట్టే విధంగా పోలీసింగ్ ఉండాలని స్పష్టం చేశారు.
- డయల్ యువర్ సీపీ, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు, అధికారులు నిర్ణీత కాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-1 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు వెన్నెముకగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ రాజేశ్వర్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పరిశ్రమలకు వెన్నెముకగా ప్రభుత్వం నిలుస్తోందని ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ సీహెచ్.రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో పారిశ్రామిక వేత్తలు, వాసీవా, ఐలా, ఫ్యాప్సీ ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారికి పూర్తి సహాయసహకారాలు అందిస్తోందన్నారు. కరోనా తర్వాత తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్న పరిశ్రమలకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఫ్యాప్సీ, వాసీవా సంయుక్తంగా ఎంఎస్ఎంఈలకు సహకరించాలని తెలిపారు. ఐలా ఎదుర్కొంటున్న సమస్యలను, రావల్సిన గ్రాంట్లను రాజేశ్వర్ రెడ్డి దృష్టి ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి తీసుకువచ్చారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ వాసీవా ఆవిర్భాం నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్.గణపతి మాట్లాడుతూ జిల్లాలో ఆటోనగర్ వాసీవాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ కమిషనర్‌ను వాసీవా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

8న 12 గంటల నిరాహార దీక్ష

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్ష పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరాహార దీక్షలు ఈనెల 8వ తేదీకి వెయ్యి రోజులకు చేరనున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో ఆ రోజు 12 గంటల నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. దీక్షను కార్మికులకు తెలియజెప్పేందుకు గోడపత్రికను విడుదల చేశారు. యూనియన్ ప్రధాకార్యదర్శి డీవీ రమణారెడ్డి మాట్లాడుతూ పోరాటంలో భాగంగా యూనియన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గల్లా శంకర్, పేర్ల నూకరాజు, జి. సూర్యనారాయణ, టి.వి. శంకరరావు, మజ్జి సూరిబాబు, సూర్య చంద్ర, పెంటయ్యరెడ్డి, తిప్పల గుర్నాథరెడ్డి, పైడిరాజు, దుర్గారావు, అప్పలరెడ్డి, దామోదర్, త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డీగా సుజాత



మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ (ఆర్‌డీ)గా డాక్టర్ బి.సుజాత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డాక్టర్ సుజాత వైద్య ఆరోగ్యశాఖలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టీసీ, ఫిమేల్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ఎన్.ఉమా సుందరి మంగళవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులో డాక్టర్ బి.సుజాతను ఇన్‌చార్జి ఆర్‌డీగా నియమించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాల పరిధిలో ఈమె సేవలందించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాతను పలువురు అభినందించారు.

విజేతలకు బహుమతులు

దొండపర్తి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్స వాలు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సీపీ ఎ.రవిశంకర్ మంగళవారం తన చాంబర్‌లో బహుమతులు అందజేశారు. అక్టోబర్ 26న పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలు అరికట్టడంలో సాంకేతికత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలుగా పెందుర్తి స్టేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎ.త్రివేణి (10వ తరగతి), ఎం.భవ్యదుర్గ (9వ తరగతి), తృతీయ స్థానంలో కంచరపాలెం స్టేషన్ పరిధిలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి వై.పురుషోత్తమ కృష్ణ నిలిచారు. పోలీస్ సిబ్బందిలో ప్రథమ విజేతగా టూ టౌన్ మహిళా కానిస్టేబుల్ షేక్ విజయ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నగర ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ బి.స్వప్న, కె.కార్తీక్ కుమార్ గెలుపొందారు. విజేతలకు సీపీ నగదు రివార్డులు అందజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అక్కిరెడ్డిపాలెం: మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గాజువాక స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. జింక్ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న కోమలి అనే మహిళ కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని సమాచారం. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం చినగంట్యాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఈ ఘటనపై సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

'మా ఇంటితో నాన్నకు సంబంధం లేదు'

ఆరిలోవ: సుందరయ్యనగర్‌లోని 133 చదరపు గజాల స్థలంలో ఉన్న ఇంటితో మా నాన్న పోలవరం నాగరాజుకు ఎలాంటి సంబంధం లేదని అతని కుమార్తె రంగాల కనకలక్ష్మి స్పష్టం చేశారు. ఈ ఇంటి విషయంలో తన కుమార్తె కనకలక్ష్మి, అల్లుడు రంగాల పైడిరాజు తనకు అన్యాయం చేశారని నాగరాజు అక్టోబర్ 27న దీక్ష చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మా నాన్న చెప్పిన దాంట్లో వాస్తవం లేదన్నారు. ఆ స్థలాన్ని తామే కొనుగోలు చేసి, రుణం తీసుకుని ఇంటిని నిర్మించుకున్నట్లు వెల్లడించారు. ఆయన మా మీద కక్షతో దీక్ష చేపట్టి.. ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు.

భారత ఐక్యతా వారధి సర్దార్ పటేల్

బీచ్‌రోడ్డులో ఘనంగా ఐక్యతా ర్యాలీలు


రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న విద్యార్థులు


వాల్తేరు క్లబ్ వద్ద గల పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీ రవిశంకర్


రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, కోస్ట్‌గార్డ్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో నవభారత నిర్మాణం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో మంగళవారం 5 కె రన్ ఫర్ యూనిటీ జరిగింది. కోస్ట్‌గార్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్వీ మిశ్రాతో కలిసి కమిషనర్ జెండా ఊపి 5కె రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రత కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని.. జాతీయ సమైక్యతకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ రచనలో ఆయన పాత్ర ఎనలేనిదని, ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మన్‌గా పనిచేశారని గుర్తు చేశారు. కాగా.. రన్‌లో పాల్గొన్న యువతీయువకులు ఐ సపోర్టు ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శించారు. కోస్ట్‌గార్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ యోగిందర్ ధాకా, ఎస్.కె.భారతీయ పాల్గొన్నారు.

సర్దార్ ఆదర్శనీయుడు

స్వాతంత్ర్య యోధుడిగా, ఉక్కుమనిషిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు ఆదర్శనీయుడని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నగర పోలీసు శాఖ ఆధ్వర్యంలో పార్క్ హోటల్ నుంచి పోలీస్ మెస్ వరకు ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన సీపీ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యతకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు కె.శ్రీనివాసరావు, ఆనంద రెడ్డి, జి.నాగన్న తదితరులు పాల్గొన్నారు. సిరిపురం వాల్తేరు క్లబ్ వద్ద పటేల్ విగ్రహానికి పోలీస్ కమిషనర్ రవిశంకర్, పోలీసు ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలి


ఆన్‌లైన్ సదస్సులో పాల్గొన్న రెక్టార్ సమత

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అధ్యాపకులు రెండు వారాల మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. యూజీసీ చైర్మన్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. అనంతరం సదస్సు వివరాలు ఆమె వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 111 కేంద్రాలలో ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులకు రెండు వారాలపాటు శిక్షణ అందించనున్నామన్నారు. రాష్ట్రంలో మూడు కేంద్రాలలో ఈ శిక్షణ ఉంటుందని, వీటిలో ఏయూ ఒకటని చెప్పారు. నవంబర్‌లో నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు వర్సిటీ అనుబంధ కళాశాలల అధ్యాపకులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. యూజీసీ సదస్సులో హెచ్‌ఆర్‌డీసీ సెంటర్ సంచాలకుడు ఆచార్య టి.వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై వెబెక్స్ ద్వారా మంగళవారం ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, జీవీఎంసీ అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న జియో ట్యాగింగ్‌ను ఈ వారాంతానికి పూర్తి చేయాలన్నారు. జగన్నాథపురం, పాపయ్యపాలెంలో లబ్ధిదారులకు ఐరిస్ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పద్మనాభం మండలం తునివలస దగ్గర బోరు లేక పనిజరగడం లేదని, వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటి యజమానుల పేరిట బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయాలని సూచించారు.

అనధికారిక మద్యం దుకాణాలపై నిఘా : అనధికారికంగా మద్యం దుకాణాలు నిర్వహించిన వారిపై నిఘా పెట్టి, కేసులు నమోదు చేయాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తదితర శాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్ లైసెన్స్ లేని హోటళ్లలో ఈవెంట్ పర్మిట్ లేకుండా మద్యం సరఫరా చేయడం వంటి కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. అక్రమ మద్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

4న ఉచిత చాట్ జీపీటీ వెబినార్

సీతమ్మధార: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహిస్తున్న ఉచిత చాట్ జీపీటీ వెబినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ కోరారు. చాట్ జీపీటీ ద ఫ్యూచర్ ఆఫ్ కోలాబిరేషన్ పేరిట నిర్వహిస్తున్న బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆసక్తి ఉన్న వారు http://www.millennium softsol.comలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సంస్థ సెంట్రల్ మేనేజర్ పి.రవి కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు 92487 53099, 91540 84157ను సంప్రదించాలన్నారు. ప్రొ.జి.వి.ఎస్ రాజ్ కుమార్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్ ప్రవల్లిక, బి.డి.ఈ.శివకుమార్ పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లా కంటకాపల్లి-అలమండ మధ్య జరిగిన ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దు చేశారు. మరికొన్ని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్-చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్, సంత్రగచ్చి-చెన్నై సెంట్రల్ (22807) ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగళూరు(22887) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్, షాలిమర్-తిరువనంతపురం (22642) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు మంగళవారం రద్దయ్యాయి.

నేడు రద్దయిన రైళ్లు : వాస్కోడగామా-షాలిమర్ (18048) అమరావతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-పలాస(08532) పాసింజర్, సికింద్రాబాద్-హౌరా (12704) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం రద్దు చేశారు.

2న రద్దయిన రైళ్లు

భువనేశ్వర్-ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు- హౌరా (12864) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా (22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా (22246) దురంతో ఎక్స్‌ప్రెస్, పలాస-విశాఖపట్నం (08531)పాసింజర్ స్పెషల్, హైదరాబాద్-షాలిమర్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 2వ తేదీన రద్దు చేశారు.

ఆలస్యంగా పలు రైళ్లు

ఆయా స్టేషన్లలో మంగళవారం బయలుదేరాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకుంటున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

- బెంగళూరులో మంగళవారం ఉదయం 8.50 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- బెంగళూరులో మంగళవారం మధ్యాహ్నం11.20 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా (12246) ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరింది.
- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.40 గంటలకు బయలుదేరింది.
- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.35 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ రాత్రి 8 గంటలకు బయలుదేరింది.
- చెన్నై సెంట్రల్‌లో మంగళవారం ఉదయం 7 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా(12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరింది.
- హౌరాలో మంగళవారం రాత్రి 11.55 గంలకు బయలుదేరాల్సిన హౌరా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.

దంతేవాడ వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల దృష్ట్యా కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పాసింజర్ స్పెషల్ గమ్యం కుదించినట్లు డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ బుధవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ బుధవారం నుంచి 6వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

రైల్వే గార్డు కుటుంబానికి అండగా ఉంటాం

మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: రైలు ప్రమాదంలో మృతి చెందిన రైల్వేగార్డు మరిపి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మంగళవారం పరామర్శించారు. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్ దరి రమ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అతని కుటుంబ సభ్యులను మేయర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ కలిశారు. అతని తల్లి, పిల్లలు, బంధువులను పరామర్శించి ఓదార్చారు. పిల్లల చదువు, వారి అందాల్సిన సాయం విషయంలో ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. స్థానికంగా అవసరమైన ఎలాంటి సహకారమైనా తన వంతు అందిస్తామని హామీ ఇచ్చారు.

నేడు డయల్ యువర్ సీపీ

దొండపర్తి: డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజల సమస్యలు, ఫిర్యాదులను సీపీ స్వయంగా స్వీకరించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఫిర్యాదులను 0891-2523408 నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా తనకు తెలియజేయవచ్చని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ సూచించారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్ర పోటీలకు ఎంపికైన నెట్ బాల్ బాల, బాలికల జట్ల సభ్యులు

భీమునిపట్నం: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక మంగళవారం కీతిన్‌పేట వద్ద గల సన్‌స్కూల్‌లో జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీల ఇన్‌చార్జి లలిత్‌కుమార్ పర్యవేక్షణలో అండర్-14, అండర్-17 బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఎంఈవో ఎం.శివరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 20 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. రెండు విభాగాల్లో జట్టుకు 12 మంది చొప్పున నాలుగు జట్లకు 48 మందిని ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 7వ తేదీ నుంచి ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

5 నుంచి స్కూల్ ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సీతమ్మధార: రాష్ట్ర చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్, ఆదిత్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2023 నిర్వహిస్తున్నట్లు ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణారావు, కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించి బ్రోచర్‌ను సీతమ్మధారలో మంగళవారం సిల్వర్ ఓక్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వై.సునీత, స్కూల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, చెస్ ప్రతినిధులు ఆవిష్కరించారు. రుషికొండలోని సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 2వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని, మరిన్ని వివరాలకు 96766 36661ను సంప్రదించాలని కోరారు.

'అందాల పోటీల్లో విజేతలుగా నిలవడం సంతోషం'


మాట్లాడుతున్న ధవల సునీత

మద్దిలపాలెం: మోంటీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో రైల్వే రాయల్ ప్యాలస్, రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన జాతీయ స్థాయి అందాల పోటీల్లో విజేతలుగా నిలవడం ఆనందంగా ఉందని మిసెస్ గార్జియస్ ఇండియా ధవల సునీత అన్నారు. మాధవధారలోని లాన్సమ్ గ్రీన్స్ ఫంక్షన్ హాలులో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ పోటీల్లో ఫైనల్‌కు చేరిన 60 మందికి అంతర్జాతీయ కొరియోగ్రాఫర్లు అరుణ రత్న, లియోని ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారన్నారు. నగరానికి చెందిన ఆరుగురు ఈ పోటీల్లో విజేతలుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. మిసెస్ కేటగిరీలో మొదటి రన్నరప్‌గా నిలిచిన జె.రేవతి మాట్లాడుతూ తామంతా గృహిణులుగా ఉంటూ.. ఈ పోటీల్లో విజేతలుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. టీన్స్ గార్జియస్ తెలగారెడ్డి నిహారిక మాట్లాడుతూ నాలుగు కేటగిరీలకు చెందిన వారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నట్లు చెప్పారు. మిస్ ఇండియా గార్జియస్ రెండవ రన్నరప్ ఆర్.మాధురి, ప్లస్ సైజ్ గార్జియస్ రన్నరప్ గొంపా శ్రీదేవి, మిస్ సౌత్ ఇండియా గార్జియస్ ఎం.వి మేఘన తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరంతా కలిసి కేక్ కట్ చేశారు.

'కార్పొరేట్ వర్గాలకు కేంద్రం ఊడిగం'


మాట్లాడుతున్న చలసాని రామారావు

సీతంపేట: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని రామారావు ఆరోపించారు. ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ ఉమ్మడి పోరాటాలకు సన్నద్ధం కావాలని, అన్ని కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తేవడానికి కృషి చేయాలన్నారు. సమ్మె హక్కు కోసం పోరాటం ఘన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్నారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎ.ఎస్.జె.అచ్యుతరావు ఆవిష్కరించారు. సభకు జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు అధ్యక్షత వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సి.హెచ్.మసేన్, జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, రెహమాన్, సత్యాంజనేయ, వామనమూర్తి, రాంబాబు, జె.డి.నాయుడు పాల్గొన్నారు.